క్లుప్తంగా

పెదనందిపాడు తహసీల్దార్‌గా హేనాప్రియ



ప్రత్తిపాడు: పెదనందిపాడు తహసీల్దార్‌గా ఎస్.హేనాప్రియ నియమితులయ్యారు. గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న హేనాప్రియను ఉద్యోగోన్నతిపై పెదనందిపాడు తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె ఇక్కడ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె చెప్పారు. కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పశువులకు రక్త పరీక్షలు



ప్రత్తిపాడు: పశువులకు అన్ని రకాల రక్త పరీక్షలను ల్యాబ్‌లో చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని అగ్రిల్యాబ్‌లో ఉన్న పశుసంవర్ధక శాఖ ప్రయోగశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రక్తనమూనాల సేకరణ, రిజిష్టర్‌లలో నమోదు, పరీక్షలు జరుగుతున్న తీరును స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాడిరైతులు తమ జీవాలకు సంబంధించిన అన్ని రకాల రక్త పరీక్షలను ల్యాబ్‌లో ఉచితంగా చేయించుకోవచ్చని, అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

14 నుంచి విద్యార్థులకు ఆర్టీసీ బస్ పాసులు

పొన్నూరు: ఆర్టీసీ డిపో పరిధిలోని విద్యార్థులకు ఈ నెల 14వ తేదీ నుంచి బస్ పాసులు అందజేయనున్నట్లు డిపో మేనేజరు టి.అజిత కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాఫ్ట్‌వేర్ విధానం అందుబాటులోకి రావడంతో 12,13 తేదీలలో పాసులు నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

గ్రామ సర్వేయర్ల లాగిన్ వర్క్ పరిశీలన



పొన్నూరు: రీ సర్వే పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలంలోని వల్లభరావుపాలెం గ్రామం రీ సర్వే లాగిన్ వర్కును శుక్రవారానికి పూర్తి చేయాలని తెనాలి డివిజన్ రీసర్వే ఇన్‌స్పెక్టర్ పార్థసారధి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ సర్వేయర్లు చేస్తున్న లాగిన్ వర్కును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 6,631 రికార్డులకు సంబంధించిన భూముల రీ సర్వే పూర్తయిన సందర్భంగా లాగిన్ వర్క్ పూర్తి చేయాలన్నారు. మండల సర్వేయర్ సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన వివరాలు 9(2) నోటీసుల ద్వారా తెలియజేసి అప్పీలు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి



గుంటూరు రూరల్: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఏటుకూరులోని నియోజకవర్గం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలతో మోసం

గుంటూరు రూరల్: తమకు తెలియకుండా తమ పేర్లతో డ్వాక్రా రుణాలను తీసుకుని తమను మోసం చేశారని చొడవరం గ్రామానికి చెందిన 43 గ్రూపులకు చెందిన డ్వాక్రా మహిళలు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. తమ గ్రూపులోని సభ్యులకు తెలియకుండా యానిమేటర్లు, సంబంధిత అధికారులు కుమ్మక్కై తమ పేర్లతో రుణాలు పొందారని వాపోయారు. బ్యాంకు నుంచి తమకు నోటీసులు వచ్చే వరకూ రుణాలు పొందినట్లు తమకు తెలియదని ఆరోపించారు. చొడవరం పరిధిలోని, సమీప గ్రామాలకు చెందిన పలు గ్రూపుల నుంచి సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల రుణాలు అన్యాక్రాంతం జరిగాయని మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

విద్యార్థి మిత్ర కిట్టు.. కొన్ని కట్

- కిట్లులో కనిపించని యూనిఫాం, షూ, సాక్సులు
- పాత దుస్తులతోనే కొత్త తరగతులకు



అయిదు వస్తువులకే పరిమితమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్టు

ప్రత్తిపాడు: పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. బడి తెరిచిన మొదటి రోజే విద్యార్థులందరికీ 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు' పంపిణీ చేస్తామని గత కొద్ది నెలలుగా ఆర్భాటంగా చెబుతున్న కూటమి ప్రభుత్వ పెద్దల మాటలు ఉత్తిమాటలేనని తేలిపోయింది. 'ఎస్ఆర్ విద్యార్థి మిత్ర కిట్లు' పేరుతో యూనిఫాం, బెల్టు, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు అందిస్తామని ఆర్భాటంగా పదేపదే ప్రకటనలు గుప్పించారు. కానీ కిట్లులో కీలకమైన యూనిఫాం, షూ, సాక్సులు అందించడంలేదు. దీంతో విద్యార్థులంతా పాత దుస్తులతోనే కొత్త తరగతుల్లో అడుగు పెట్టనున్నారు. ఇదిలా ఉంటే కిట్లు కూడా సరిపడినన్ని రాలేదని తెలుస్తోంది. ప్రత్తిపాడు మండలంలో గతేడాది మార్చి నెల డైస్ లెక్కల ప్రకారం ఎన్‌రోల్ 2,603 మంది ఉండగా.. ప్రస్తుతం కిట్లు మాత్రం 2,350 మాత్రమే వచ్చాయి. దీంతో వాటినే అన్ని పాఠశాలలకు సర్దుబాటు చేశారు.

తల్లికి వందనం జమయ్యేనా..

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది గడుస్తుంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే తల్లికి వందనం అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ప్రత్తిపాడు మండలంలో 44 ప్రభుత్వ, 8 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 4,844 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ తల్లికి వందన పథకం వర్తించాల్సి ఉంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇంట్లో ఎంత మంది పిల్లలు పాఠశాలకు వెళ్తుంటే అంత మందికీ పథకం వర్తింపజేస్తామని ఎన్నికల సమయంలో నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమవుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.



పాఠశాలలకు చేరిన పుస్తకాలు

ఒక్కొక్కటిగా అందజేస్తాం..

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ఇప్పటికే అన్ని పాఠశాలలకు అందించాం. పాఠశాల తెరిచిన మొదటి రోజే విద్యార్థులందరికీ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టు, డిక్షనరీలతో కూడిన కిట్లు పంపిణీ చేసేలా ఆదేశాలూ జారీ చేశాం. యూనిఫాం, షూలు, సాక్సులు ఒక్కొక్కటిగా వస్తున్నాయి. అవి రాగానే ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తాం.

– జి.లీలారాణి, ఎంఈవో–2, ప్రత్తిపాడు

వైఎస్సార్‌సీపీ విజయమే ప్రతి ఒక్కరి లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వైఎస్సార్‌సీపీ విజయమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకానిలో బుధవారం గ్రామ పార్టీ కమిటీ నియామకం చేపట్టారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకూ అందుబాటులో ఉంటూ అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యున్నతికి పాటు పడతానన్నారు. కూటమి ప్రభుత్వం అమలు కాని సంక్షేమ పథకాలను ప్రకటించి ప్రజలను మరోసారి మోసం చేసిందన్నారు. గ్రామ పార్టీ అధ్యక్ష నియామకంలో సుంకర కృష్ణారెడ్డి, బండ్లమూడి బానుకిరణ్ పేర్లు ప్రస్తావనకు రావడం, భాను సుంకర కృష్ణారెడ్డి పేరును ప్రతిపాదించడంతో గ్రామపార్టీ అధ్యక్ష ఎంపిక పూర్తయ్యింది. త్వరలో అన్ని కమిటీల ఎంపిక పూర్తి చేయడం జరుగుతుందని మండల అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, ఆలపాటి రాఘవ, దానబోయిన నాగేశ్వరరావు, వీర్ల వీరాంజనేయులు, షేక్ నజీర్ అహ్మద్, మురికిపూడి చంద్రశేఖర్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఉపేక్షించం



కార్యక్రమంలో విజయకృష్ణ, కేవీఎల్ఎన్ మూర్తి

చేబ్రోలు: విద్యుత్ సర్వీసుల తనిఖీలు విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగ పర్యవేక్షక ఇంజనీర్ బి.విజయకృష్ణ అన్నారు. చేబ్రోలు సెక్షన్ పరిధిలోని గుండవరం, గొడవర్రు, మంచాల, తోట్లపాలెం, ఉప్పరపాలెం, శేకూరు, శేకూరుపాలెం, వడ్లమూడి గ్రామ పరిధిలోని విద్యుత్ శాఖాధికారుల బృందం బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 62 మంది అధికారులు, 186 మంది సిబ్బంది, 62 మంది బృందాలుగా ఏర్పడి 4,329 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చట్టానికి వ్యతిరేకంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారికి మొత్తంగా రూ.4.22 లక్షల అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. భారత విద్యుత్ చట్టం 135 ప్రకారం పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్నా.. ఉండాల్సిన మీటరకు బదులు వేరే మీటరు పెట్టి సీలు వేయకపోయినా ఉపేక్షించమని, అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు. తనిఖీలలో డీఈఈ ఎస్.మల్లిఖార్జున ప్రసాద్, డీఈఈ బి.అశోక్ కుమార్, ఏఈలు కె.కోటేశ్వరరావు, యు.శివశంకర్, స్థానిక ఏఈ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారుల బదిలీ

పొన్నూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలోని పలువురు అధికారులు బుధవారం బదిలీ అయ్యారు. సీఎస్ డీటీగా పనిచేసిన ఎం.వెంకట్రావు బదిలీపై డివిజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా బదిలీ అయ్యారు. ఖాళీగా ఉన్న కార్యాలయం సూపరింటెండెంట్ స్థానంలో గుంటూరు కలెక్టరేట్ డీటీగా పనిచేసిన ఎ.మాధవి రానున్నారు. ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ హసన్ అహ్మద్ మంగళగిరికి బదిలీ అయ్యారు. మున్సిపల్ కార్యాలయం మేనేజరుగా ప్రకాశం జిల్లా చీమకుర్తి మున్సిపాలిటి నుంచి పోతురాజు రానున్నారు. పొన్నూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణిగా సీహెచ్ ఉమా మహేశ్వరీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె నర్సరావుపేట నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీడీపీఓ వెంకట రమణ పల్నాడు జిల్లా క్రోసూరుకు బదిలీ అయ్యారు.

డిజిటల్, స్మార్ట్ విలేజ్‌పై కేంద్ర బృందం పర్యటన



సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు టెలీ కమ్యూనికేషన్ డైరక్టర్ పీవీ ప్రవీణ్, రాధిక

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు గ్రామంలో డిజిటల్, స్మార్ట్ విలేజ్ అభివృద్ధిపై బుధవారం కేంద్ర బృందం వివిధ అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసింది. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో కేంద్ర ప్రభుత్వ టెలీ కమ్యూనికేషన్ డైరక్టర్ పీవీ ప్రవీణ్, డివిజన్ లెవల్ అధికారి రాధిక మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో సమృద్ధి విలేజ్‌గా ఎంపిక చేసేందుకు గతనెల 22న కేంద్ర బృందం నారాకోడూరులో పర్యటించారు. క్షేత్ర స్థాయిలో మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలను తెలుసుకున్నారు. డివిజల్ సేవల డిమాండ్ గురించి ప్రజల నుంచి సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆర్ సుబ్బారావు, మండల స్థాయి అధికారులు కె.శ్రీనివాసశర్మ, ఊహారాణి, బి.శ్రీనివాస నాయక్, శ్రీలక్ష్మి, అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాలలో విద్యాబోధన ఉంటుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంలో గల కళాశాలలో ఢిల్లీకి చెందిన మ్యాన్ కైండ్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ విద్యార్థులకు మెడికల్ రిప్రజెంటేటివ్ విభాగంలో ప్రాంగణ ఎంపిక నిర్వహించారు. ఎంపికల్లో కంపెనీ ఏరియా మేనేజర్ లింగం పవన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరాలను తెలియజేశారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన 17 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారు. వారిని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, తదితరులు అభినందించారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

ప్రత్తిపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రత్తిపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన నియోజకవర్గ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యంను ప్రత్తిపాడు మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. స్థానిక వేణుగోపాల స్వామి గుడి వద్ద రేషన్ బియ్యంతో ఉన్న వాహనాన్ని మంగళవారం రాత్రి పోలీసులు గుర్తించారు. కానీ పోలీసులు వాహనాన్ని స్టేషనుకు తరలించలేదు. ఏం జరిగిందో ఏమో గానీ.. తిరిగి అర్ధరాత్రి తరువాత వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు రప్పించి కేసు నమోదు చేశారు. ఆటోలో ఇరవై బస్తాల రేషన్ బియ్యం దొరకడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పోలీసులు తొలుత వాహనాన్ని గుర్తించిన సమయంలో ఆటో నిండా రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి బాలురుపై కేసు

గుంటూరు రూరల్: ఇద్దరి బాలురులకు చూసేందుకు నిండా పదిహేనేళ్లు కూడా లేవు. కానీ వాళ్లు చేసే దొంగతనాలు కోకొల్లలు. వివరాల్లోకి వెళితే.. వెంగళాయపాలెం పూలేకాలనీకి చెందిన ఇద్దరు చిన్నారులు మంగళవారం రాత్రి స్థానిక సాయిబాబా ఆలయం సమీపంలోని చిల్లర దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. బుధవారం తెల్లవారుజామున దుకాణం యజమాని పిలిప్స్ దుకాణం తలుపు తీసి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. షాపులోని సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు బాలురులు సీసీ కెమేరాలను సైతం వెనక్కు తిప్పి దుకాణం పైనుంచి వెళ్లినట్లు తెలిసింది. దీంతో స్థానికులు ఇరువురినీ గుర్తించి వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో బాలురులు గతంలో చేసిన నేరాలను సైతం ఒప్పుకొన్నారు. ఇద్దరూ అన్నదమ్ములని.. వారి వయస్సు ఒకరికి 13.. మరొకరికి 9 ఉంటాయని స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు బాలురులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

14,15 తేదీల్లో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, వెంకటేశ్వరరావు

లక్ష్మీపురం: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభలు ఈనెల 14,15 తేదీలలో గుంటూరులో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ నగర కార్యాలయంలో బుధవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంస్థ పరిరక్షణ కోసం మహాసభల్లో ప్రధాన చర్చ ఉంటుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు వాటి నిర్వహణ షిరిడి సాయి వంటి ప్రైవేటు సంస్థలకు అప్పగించటం వాటి నిర్వహణలో పెద్ద ఎత్తున లోపాలు ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికే ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం ప్రధానమైన చర్చ జరుగుతుందని వివరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రివర్స్ అమలు జరిపి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. జేఎల్ఎం గ్రేడ్- 2 లను గాంధీ జయంతి రోజు ఉద్యోగులుగా తీసుకొని నేటికీ వారిని గాలిలో దీపం లాగా ఉంచారన్నారు. మహాసభలను ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి ఎస్.రాజేందర్ ప్రారంభించనున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.వేణు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనపై శ్వేత పత్రం విడుదల చేయాలి

సీపీఐ నాయకుడు అజయ్ కుమార్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల

లక్ష్మీపురం: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కొత్తపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో పేదలకు ఇళ్ల స్థలాలు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేస్తానని చెప్పి సంవత్సరం గడుస్తున్న ఇచ్చే ప్రయత్నం కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారో సమాధానం చెప్పాలని కోరారు. గిట్టుబాటు ధర లభించక రైతులు, కౌలు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీ మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని, అన్ని వర్గాల మహిళలకు సంవత్సరానికి రూ.15,000 ఇస్తానని చెప్పి, అలాగే మహిళలకు ఉచిత బస్సు పథకం మహిళలను ఊరిస్తూ ఏ పథకాలు ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడారు. సమావేశంలో నాయకులు పచ్చల శివాజీ, ఆకీటి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య పాల్గొన్నారు.

ప్రజా హృదయాల్లో సినీ సంగీతానికి ప్రత్యేక స్థానం



లక్ష్మీపురం: ప్రజా హృదయాల్లో తరగని ఆదరాభిమానానికి మారుపేరుగా సినీ సంగీతం ప్రత్యేక స్థానం సంపాదించడంలో సందేహం లేదని ప్రముఖ రంగస్థల నటులు, ఇంజినీర్ పి.ఘన శ్యామాచార్యులు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పాడుదాం రండి బృందం ఆధ్వర్యంలో బుధవారం సినిమా పాటలు నాడు- నేడు అన్న అంశంపై చర్చ నిర్వహించారు. సీనియర్ గాయని యార్లగడ్డ లక్ష్మి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ నాటి సినిమాల్లో పాటల్లో సామాజిక ప్రయోజనాలుండేవి, ప్రజల్ని చైతన్య వంతుల్ని చేసేవని గుర్తు చేశారు. యువతకు మాత్రమే స్ఫూర్తి నిస్తున్నాయని కొన్ని పాటలైతే కాలక్షేపం కోసం వినేలా మాత్రమే ఉన్నాయని అన్నారు. అనంతరం పాడుదాం రండి బృందం పాడిన గేయాలు అందరిని అలరించాయి.

అవకతవకలను విచారించాకే రికవరీ



అవకతవకల ఫైల్‌ను ఏజీఎంకు చూపిస్తున్న ఏపీఎం లాజరు

ప్రత్తిపాడు: స్త్రీనిధి రుణాల మంజూరు, చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిగిన తరువాతనే రికవరీ గురించి ఆలోచిస్తామని.. అప్పటి వరకు మేం చేయగలిగింది ఏమీ లేదని వెలుగు ఏపీఎం వి.లాజరు స్త్రీ నిధి ఏజీఎంకు తేల్చి చెప్పారు. ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో బుధవారం స్త్రీనిధి రుణాల రికవరీపై వీవోఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్త్రీనిధి ఏజీఎం ఎస్.హర్షవర్ధన్ వీవోల వారీగా స్త్రీనిధి రుణాలు, బకాయిలు, చెల్లింపులపై సమీక్ష నిర్వహించారు. అదే సమయంలో ప్రత్తిపాడు వీవోఏను రికవరీపై ఏజీఎం ప్రశ్నించారు. రుణాలు తీసుకున్న వారు వాయిదాలు ఎందుకు చెల్లించడం లేదని.. రికవరీలు లేకుంటే మిగిలిన సభ్యులకు రుణాలు ఎలా ఇస్తామని ప్రశ్నించారు. దీంతో స్పందించిన ఏపీఎం లాజరు ప్రత్తిపాడులోని ఓ గ్రామ సంఘంలో ఒక గ్రూపు పేరుతో రూ.4.5 లక్షలు స్త్రీనిధి రుణం తీసుకున్నారని.. కానీ ఆ రుణమొత్తం గ్రూపు సభ్యులకు చేరలేదన్నారు. వీటన్నింటికీ సంబంధించిన ఆధారాలు రికార్డులతో సహా ఉన్నాయన్నారు. స్త్రీనిధి అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేయిస్తానని పీడీ చెప్పారని, విచారణ జరిగే వరకు రికవరీ విషయంలో మేమేమీ చేసేది లేదని స్పష్టం చేశారు. స్పందించిన ఏజీఎం హర్షవర్ధన్ మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన వీవోఏపై పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయాలని, అదే విధంగా వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్తిపాడు నియోజకవర్గ స్త్రీనిధి మేనేజర్ ఆనంద్, సీసీలు, మండల సమాఖ్య ఓబీలు, వీవోఏలు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. కొండపల్లి ఓఎన్‌జీసీ నుంచి చిలకలూరిపేట వైపు గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ బుధవారం ఉదయం అదుపుతప్పింది. ప్రత్తిపాడు మండలం నడింపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న అండర్ పాస్ బ్రిడ్జి గోడను లారీ ఢీకొట్టింది. దీంతో లారీ అదుపు కాక గోడపైకి దూసుకెళ్లింది. లారీలోని సిలిండర్లు ఖాళీవి కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కసారిగా లారీ గోడపైకి దూసుకురావడంతో బ్రిడ్జి కింద సర్వీసు రోడ్డులో ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఎక్కడ కింద పడుతుందో, సిలిండర్లు పేలతాయోనని ప్రాణాలను అరచేతిలో పట్టుకుని పరుగులు పెట్టారు. ప్రమాదంలో లారీ ముందు భాగం బాగా దెబ్బతిన్నది.

– ప్రత్తిపాడు

వైభవంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



వేడుకల్లో విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ.. ఈ ఏడాది పంటలు బాగా పండి రైతన్నలు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఏడీఆర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మణి, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ కరుణ సాగర్, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ కె.రాధిక, డాక్టర్ దుర్గాప్రసాద్, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు. కాకుమాను గ్రామంలో ఏరువాక పున్నమి సందర్భంగా నూతి సుబ్బారావు పొలంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కె.కిరణ్మయి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్వేత కృష్ణప్రియ, ఎం.శివప్రసాద్, డి.షణ్ముఖ క్షేత్ర పాల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఏరువాక సాగడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏడీఏ గుంటూరు టి.శ్రీనివాసరావు, డీపీఎమ్ రాజకుమారి, డీఆర్‌సీ ఏడీఏ సునీత, ఏడీఏ శివకుమారి, ఏవో సుబ్రహ్మణ్యం, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, గ్రామ ఉపసర్పంచ్ నామ శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేసి ఏరువాక సాగారు. గుంటూరు జిల్లా నూతన వ్యవసాయ అధికారి యు.నరసింహారావు, అధికారులు, రైతులు అరకతో దుక్కి దున్ని నవధాన్యాలను పొలంలో చల్లారు.